సాక్షి
డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ


మంగళవారం । 25 । మార్చి । 2025



అతి వేగానికి ఇద్దరు యువకుల బలి

అతి వేగం ఇద్దరు యువకులను బలి తీసుకుంది. పెరవలి మండలం అన్నవరప్పాడు సెంటర్‌లో మోటార్ సైకిల్‌ను కారు ఢీకొని ఇద్దరు యువకులు మృతి చెందారు.

8లో



డెల్టాలకు నీటి విడుదల

ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి సోమవారం తూర్పు డెల్టాకు 3,200, మధ్య డెల్టాకు 2 వేలు, పశ్చిమ డెల్టాకు 5,500 క్యూసెక్కుల చొప్పున గోదావరి నీటిని విడుదల చేశారు.

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ మంగళవారం (సాయంత్రం)	సహర్ బుధవారం (ఉదయం)
రాజమండ్రి	6.24	4.42
కాకినాడ	6.24	4.42
అమలాపురం	6.24	4.42

న్యూస్‌రీల్

పది పరీక్షలకు 99.40 శాతం హాజరు

ముమ్మిడివరం: పదో తరగతి విద్యార్థులకు సోమవారం లెక్కలు పరీక్ష ప్రశాంతంగా జరిగింది. జిల్లాలో 22 మండలాల్లో 110 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. మొత్తం 19,115 మంది విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఉండగా 19,001 మంది హాజరయ్యారు. 114 మంది పరీక్షలకు గైర్హాజరయ్యారు. ఉదయం 9 నుంచి 12.45 గంటల వరకు పరీక్షలు రాశారు. 18,932 మంది రెగ్యులర్, 69 మంది ప్రయివేటు విద్యార్థులు పరీక్షలు రాశారు. మొత్తం 99.40 శాతం మంది పరీక్షలకు హాజరైనట్టు జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ షేక్ సలీం బాషా తెలిపారు. పరీక్షా కేంద్రాలను డీఈవో, డీవైఈవో జి.సూర్యప్రకాష్ ప్రభుత్వ పరీక్షల విభాగం అసిస్టెంట్ కమిషనర్ బి.హనుమంతరావుతోపాటు ఐదు ఫ్లయింగ్ స్క్వాడ్‌లు జిల్లాలో మొత్తం 24 పరీక్షా కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేశారు.

అర్జీలకు పరిష్కారం చూపాలి

అమలాపురం రూరల్: అర్జీదారుల సమస్యలకు పరిష్కార మార్గాలు చూపాలని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ గోదావరి భవన్‌లో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక మీ కోసం కార్యక్రమంలో ఆయన, జాయింట్ కలెక్టర్ నిషాంతి, డీఆర్‌ఓ రాజకుమారి, జిల్లా నీటి డ్వామా పీడీ మధుసూదన్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కృష్ణమూర్తి 335 అర్జీలను స్వీకరించారు.

విద్యామిత్ర కిట్ల పంపిణీకి ఏర్పాట్లు

ముమ్మిడివరం: వచ్చే విద్యా సంవత్సరానికి విద్యార్థులకు అంజేసేందుకు ఉద్దేశించిన సర్వేపల్లి రాధాకృష్ణ విద్యామిత్ర కిట్లను సక్రమంగా, సమర్థంగా పంపిణీ చేసేందుకు అన్ని ఏర్పాట్లు చేసుకోవాలని జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ షేక్ సలీంబాషా సూచించారు. ఎయిమ్స్ ఇంజినీరింగ్ కళాశాల సమావేశపు హాలులో సోమవారం పీఎంశ్రీ ప్రధానోపాధ్యాయుల, పీఆర్‌ఎంటీలు, ఐటీ స్టాఫ్, ఒకేషనల్ ఇన్‌స్ట్రక్టర్లకు ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. సైన్స్ అండ్ అకౌంట్స్ అధికారి జి.ప్రవీణ్‌కుమార్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో డీఈవో మట్లాడుతూ విద్యామిత్ర కిట్లకు సంబంధించి ఇండెంట్ ప్రకారం పంపిణీ దారులు, త్వరలోనే కిట్లు మండల కేంద్రాలకు సరఫరా చేయనున్నట్లు ఆయన తెలిపారు. కిట్లు భద్రపర్చేందుకు అవసరమైన ఏర్పాట్లు చేసేందుకు మండల విద్యాశాఖాధికారులకు మార్గ దర్శకాలు జారీ చేశామన్నారు. సమగ్ర శిక్ష సీఎంవో బీవీవీసుబ్రహ్మణ్యం, జీసీడీవో డా. ఎంకేబీమారావు, ఏఎల్‌ఎస్ కోఆర్డినేటర్ డి.రమేష్‌బాబు, ఐఈ కోఆర్డినేటర్ ఎంవీవీసత్యనారాయణ, ఏఎంవో పి.రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

ఇంజినీర్ పోస్టుల భర్తీకి నేడు పరీక్ష



సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్‌ఓ రాజకుమారి

అమలాపురం రూరల్: రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఆధ్వర్యంలో మంగళవారం సహాయ పర్యావరణ ఇంజినీర్ల పోస్టుల భర్తీకి కంప్యూటర్ బేస్డ్ రాత పరీక్షను నిర్వహిస్తునట్లు జిల్లా రెవెన్యూ అధికారి బీఎల్ఎస్ రాజకుమారి తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లో రాత పరీక్ష నిర్వహణ కోసం ఏర్పాట్లపై అధికారులతో సమీక్షించారు. ఆమె మాట్లాడుతూ పబ్లిక్ సర్వీస్ కమిషన్ సహాయ లైబ్రేరియన్ పోస్టులు సహాయ పర్యావరణ ఇంజనీర్లు, ఎనలిస్ట్ గ్రేడ్ -2 పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ పోస్టుల కోసం దరఖాస్తులు ఆహ్వానించగా జిల్లా నుంచి కేవలం సహాయ పర్యావ రణ ఇంజనీర్లు పోస్టులు కోసం మాత్రమే 340 మంది దరఖాస్తు చేసుకున్నట్లు తెలిపారు. 340 మంది అభ్యర్థులకు కంప్యూటర్ బేస్డ్ రాత పరీక్ష నిర్వహణ కోసం రెండు పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కాట్రేనికోన మండలం చెయ్యేరు శ్రీనివాసా ఇంజినీరింగ్ కళాశాలలో 165 మంది రాత పరీక్ష రాసేందుకు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. భట్లపాలెం బీవీసీ ఇంజినీరింగ్ కళాశాలలో 175 మంది పరీక్ష రాసేందుకు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఉదయం 9:30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్ష ఉంటుందన్నారు. పబ్లిక్ సర్వీస్ కమిషన్ సెక్షన్ అధికారి కె.భాస్కరరావు డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఎం.దుర్గారావు దొర, మున్సిపల్ కమిషనర్ కేవీవీ ఆర్ రాజు పాల్గొన్నారు.



అమలాపురంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఆక్వా రైతులు



కలెక్టరేట్‌కు ర్యాలీగా వస్తున్న ఆక్వా రైతులు

కదం తొక్కిన ఆక్వా రైతులు

- లో ఓల్టేజ్ ముంచేస్తోందని ఆందోళన
- అమలాపురంలో నిరసన ర్యాలీ
- రొయ్యలు కౌంట్‌పై ఉన్నాయి.. విద్యుత్ కోతలు వద్దని డిమాండ్
- నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలి
- ట్రాన్స్‌ఫార్మర్ల చార్జీలు తగ్గించాలి
- రొయ్యలకు కనీస మద్దతు ధర కల్పించాలని వినతి

సాక్షి, అమలాపురం/ అమలాపురం రూరల్: 'రొయ్యల కొనుగోలుదారుల గుత్తాధిపత్యం విడనాడాలి. ఆక్వా ధరలు ఇష్టానుసారం తగ్గించడం మానివేయాలి. రొయ్యల మేతల ధరలు తగ్గించాలి. విద్యుత్‌లో ఓల్టేజ్ లేకుండా నాణ్యమైన విద్యుత్ అందించాలి. ట్రాన్స్‌ఫార్మర్ల రేట్లు తగ్గించాలి. విద్యుత్ అధికారుల అక్రమదాడులు నిలుపుదల చేయాలి' అని డిమాండ్ చేస్తూ ఆక్వా రైతులు కదం తొక్కారు. అమలాపురం వీధుల్లో సోమవారం భారీ మోటార్ సైకిల్ ర్యాలీ నిర్వహించారు. పట్టణ శివారు క్షత్రియ కళ్యాణ మండపం వద్ద ప్రారంభమైన ఈ ర్యాలీ గడియార స్తంభం సెంటరు, ముమ్మిడివరం గేట్, నల్లవంతెన మీదుగా కలెక్టరేట్ వరకు సాగింది. ఆక్వా రైతులు పెద్ద ఎత్తున పాల్గొని ''విద్యుత్ బాదుడు ఆపండి.. ఆక్వా రైతులను ఆదుకోండి'' అనే నినాదాలతో హోరెత్తించారు. కూటమి ప్రభుత్వ విద్యుత్ విధానాలు.. కొనుగోలుదారులు సిండికేటుగా మారి తక్కువ ధరలకు రొయ్యల కొనుగోలు చేయడం వల్ల నష్టపోతుండడంతో కడుపు మండిన ఆక్వా రైతులు కోనసీమ ఆక్వా రైతు పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో ఈ నిరసన ప్రదర్శనకు దిగారు. ఎస్‌పీఎల్ చార్జీలని, అదనపు లోడని, షార్ట్ ఫాల్ చార్జీలని వసూలు చేస్తూ ఆక్వా రైతుల నడ్డి విరుస్తున్నారని విమర్శించారు. ఆక్వాకు విద్యుత్ రాయితీ ఇస్తున్నామని పేరుకే చెబుతున్నారు. ఏదో ఒక రూపంలో అదనపు చార్జీలు వసూలు చేస్తున్నారు అని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. రొయ్యల చెరువులలో రొయ్యలు, చేపలు ఉన్న సమయంలో విద్యుత్ సరఫరా నిలిపివేయడం అన్యాయమని రైతు ప్రతినిధులు వాపోయారు. ఆక్వా చెరువుల్లో రొయ్యలు లేని సమయంలో కౌంట్ ధరలు పెరిగాయి. పట్టుబడులు జరుగుతున్న సమయం చూసి రేటు తగ్గించి వేస్తున్నారు. కొనుగోలుదారులు సిండికేటుగా మారి రైతులను ముంచేస్తున్నారని ఆరోపించారు.

ఏసీడీ రూపంలో అధిక చార్జీలు



విద్యుత్‌శాఖ అధికారులు లో ఓల్టేజ్ విద్యుత్ సరఫరా చేస్తున్నారు. దీనివల్ల మోటార్లు కాలిపోతున్నాయి. లో ఓల్టేజ్ వల్ల విద్యుత్ ఎక్కువగా వాడాల్సి వస్తోంది. సగం విద్యుత్ వాడుకున్నా.. అధికంగా వాడుకున్నట్టు చూపించి ఏసీడీ రూపంలో అధికంగా చార్జీలు వసూలు చేస్తున్నారు. ఏపీ జెన్‌కో, ట్రాన్స్‌కో లోటు బడ్జెట్ ఉందని ఆదాయం పెంచాలని టార్గెట్ పెట్టడంతో అక్రమ మార్గంలో రూ.లక్షలు వసూలు చేస్తున్నారు. నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయడం లేదు.

– **దెందుకూరి సత్తిబాబు రాజు**, ఆక్వా రైతు, టీడీపీ అల్లవరం మండలం శాఖ అధ్యక్షుడు, రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్

ఆక్వాను ఆదుకోవాలి



ఎన్ని కష్టాలున్నా ఆక్వాను నమ్ముకుని రైతులు సాగు చేస్తున్నారు. ప్రభుత్వం ఆక్వాను ప్రోత్సహిస్తున్నామని చెబుతున్నా దిగువ స్థాయిలో రైతులకు మేలు చేయడం లేదు. ప్రభుత్వం తక్షణం స్పందించి ఆక్వా రైతులకు మేలు చేయాలి.

– **రుద్రరాజు వెంకటపతి రాజు (నానీరాజు)**, కోనసీమ ఆక్వా రైతు పరిరక్షణ సమితి అధ్యక్షుడు

ఆక్వా వెంటిలేటర్ మీద ఉంది



రాష్ట్రంలో ఆక్వా వెంటిలేటర్ మీద ఉంది. విద్యుత్ శాఖ ప్రత్యేక డ్రైవ్ పేరుతో ఎస్‌పీఎల్ చార్జీలు, విద్యుత్ మీటరు, ట్రాన్స్‌ఫార్మర్ల పేరుతో భారీగా చార్జీలు వసూలు చేస్తున్నారు. ఎప్పుడో పదేళ్ల క్రితం ఉన్న పీపీఎస్-1, పీపీఎస్-2 సొమ్ము వసూలు చేస్తున్నారు. 20 హెచ్‌పీ మీటరు వాడకున్నా రూ.పది వేల నుంచి రూ.15 వేలు బిల్లు వస్తోంది. సీఎం చంద్రబాబు నాలుగు లక్షల ఎకరాల్లో ఉన్న ఆక్వాను పది లక్షల ఎకరాలకు పెంచుతామన్నారు. కాని ఉన్న లక్షన్నర ఎకరాలకు పడిపోయే ప్రమాదముంది.

– **త్సవటపల్లి నాగభూషణం**, జనసేన సీనియర్ నాయకుడు, కోనసీమ ఆక్వా రైతు పరిరక్షణ సమితి గౌరవాధ్యక్షుడు

ఆక్వా కుటుంబంలో రైతులు చితికిపోతున్నారు



రైతులు, కొనుగోలుదారులు, ఎగుమతిదారులు, సీడ్, ఫీడ్ యజమానులు అంతా ఆక్వా కుటుంబం అని చెబుతున్నారు. మొత్తం కుటుంబంలో రైతులు మాత్రమే చితికిపోతున్నారు. మాకు అండగా నిలబడాల్సింది పోయి అణగదొక్కుతున్నారు. విద్యుత్ శాఖలోని లోపాలను మా మీద రుద్దుతున్నారు.

– **యాళ్ల వెంకటానందం**, కోనసీమ ఆక్వా రైతు పరిరక్షణ సమితి ప్రధాన కార్యదర్శి

వేసవిలో కార్మికులు అప్రమత్తంగా ఉండాలి

అమలాపురం రూరల్: వేసవి ఉష్ణోగ్రతలను దృష్టిలో ఉంచుకుని కార్మికులు పనివేళలో అప్రమత్తంగా ఉండాలని జిల్లా కార్మిక శాఖ సహాయ కమిషనర్ టి.నాగలక్ష్మి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. విపత్తుల నివారణ సంస్థ ముందస్తు హెచ్చరికలకు అనుగుణంగా కార్మికుల రక్షణకు సంబంధిత యాజమాన్యాలు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని రాష్ట్ర కార్మిక కమిషనర్ శేషగిరిబాబు ఆదేశాలు జారీ చేశారని తెలిపారు. జిల్లాలోని కర్మాగారాలు, వివిధ రకాల దుకాణాల్లో పనిచేసే కార్మికులు, భవన నిర్మాణ కార్మికులు, వలస కూలీ లు తీసుకోవాల్సిన జాగ్ర త్తలపై ఇదివరకే పలు సూచనలు చేశామన్నారు. కార్మికుల పని గంటల్లో మార్పు చేసి పని ప్రాంతంలో చల్లని నీరు, నీడ వసతి కల్పించాలని సూచించారు. వైద్య సిబ్బందితో సమన్వయం చేసుకుని ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు, ఐవీ ఫ్లూయిడ్స్, అత్యవసర ప్రాథమిక చికిత్స మందులు సమకూర్చుకోవాలని, మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 4 గంటల వరకు కార్మికుల పని వేళల్లో మార్పులు చేయాలని, డీహైడ్రేషన్ నివారణ మార్గాలపై కార్మికులకు అవగాహన కల్పించాలని యాజమాన్యాలను ఆమె కోరారు.

హౌసింగ్ అధికారులపై చర్యలకు డిమాండ్

– కలెక్టరేట్ వద్ద బాధితుల ధర్నా

అమలాపురం రూరల్: రావులపాలెంలో ఇళ్ల పట్టాలు ఇస్తామని డబ్బు తీసుకుని మోసం చేసిన గృహ నిర్మాణ సంస్థ అధికారులపై చర్యలు తీసుకోవాలని బాధితులు అమలాపురం కలెక్టరేట్ వద్ద సోమవారం నిరసన తెలిపారు. రావులపాలెం గ్రామంలో సర్వే నంబర్ 41-1, 3లో జగనన్న కాలనీలో 80 మందికి ఇళ్ల పట్టాలు ఇస్తామని హౌసింగ్ కార్పొరేషన్ వర్క్ ఇన్‌స్పెక్టర్ పమ్మి శ్రీహరి మురళీకృష్ణ, కుమారులు భరత్, సాయి మోసం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. జగనన్న కాలనీలో స్థలాలు ఖాళీగా ఉన్నాయని, పట్టాలు ఇస్తామని చెప్పి రూ. 1.20 కోట్లు వసూలు చేశారని బాధితులు ఆరోపించారు. హౌసింగ్ కార్పొరేషన్ డీఈఈ శ్రీనివాస్ ప్రసాద్, ఏఈ జీజి బాబు, రావులపాలెం తహసీల్దార్ ద్వారా ఇంటి పట్టాలు ఇప్పిస్తామని చెప్పి 2024 ఆగస్టు నెలలో 2 సెంట్లు స్థలానికి రూ.1.5 లక్షలు ఒక సెంటు స్థలానికి రూ.30 వేలు వసూలు చేశారన్నారు. 7 నెలలు గడుస్తున్నా పట్టా ఇవ్వకపోవడంతో అనుమానంతో వారిని నిలదీయగా వాయిదాలు వేసుకుంటూ వచ్చి జిరాక్స్ పట్టాలు చూపించారన్నారు. రావులపాలెంలో కొత్త కాలనీలో ఖాళీ ఇళ్ల స్థలాలు చూపించారని, తమకు ఒరిజినల్ పట్టాలు, స్థలాలు ఇవ్వకపోవడంతో విచారణ చేయగా సుమారు 80 మందిని మోసం చేసి కోటి ఇరవై లక్షల రూపాయలు వసూలు చేశారని తెలిసిందని చెప్పారు. కొందరు ఫోన్ పే ద్వారా చెల్లించారు. అధికారులపై చర్యలు తీసుకుని ఇంటి స్థలానికి చెల్లించిన నగదును ఇప్పించి తమకు న్యాయం చేయాలని బాధితులు అడపా వెంకటేశ్వరరావు, బోరుసు జ్యోతి పాటు అమలాపురం బీఎస్‌పీ నాయకుడు పోలమూరి మోహన్ కోరారు.

కలెక్టర్ వద్ద నిరసన తెలుపుతున్న బాధితులు



విజ్ఞాన శాస్త్ర పర్యటన విజయవంతం



కోరంగి అభయారణ్యంలో విద్యార్థులు

ముమ్మిడివరం: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో చేపట్టిన విజ్ఞాన శాస్త్ర పర్యటన విజయ వంతంగా ముగిసింది. మూడు రోజులపాటు తిరుపతిలోని ప్రముఖ శాస్త్ర, సాంకేతిక, చారిత్రాత్మక ప్రదేశాలను జిల్లాకు చెందిన 116 మంది విద్యార్థులు, 15 మంది గైడు ఉపాధ్యాయులు సందర్శించారు. తిరుపతి ఐఐటీ క్యాంపస్, శ్రీ వెంకటేశ్వర జూలాజికల్ పార్క్, తిరుపతి రీజనల్ సైన్స్ సెంటర్, ప్లానిటోరియం షో విద్యార్థులు చూశారు. చివరి రోజు సోమవారం కోరంగి మడ అడవులు, యానాం సముద్ర తీరం సందర్శించి పక్షి ప్రయాణాలు, జీవ వైవిధ్యం, సముద్రపు అంచుల సమీకరణం వంటి అంశాలపై అధ్యయనం చేశారు. విద్యార్థుల విజ్ఞాన పర్యటన–పుస్తకరూపంలో... ఈ విజ్ఞాన శాస్త్ర యాత్రలో విద్యార్థులు నిర్వహించిన పరిశోధనలను, చేసిన గమనికలను ఒక గ్రంథంగా రూపొందించి కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్‌కు సమర్పించనున్నట్లు జిల్లా సైన్స్ అధికారి జీవీఎస్ సుబ్రహ్మణ్యం తెలిపారు.

క్షయ కానరాని ప్రపంచాన్ని నిర్మించాలి

కలెక్టర్ మహేష్‌కుమార్

అమలాపురం రూరల్: అందరి సమన్వయ భాగస్వామ్యంతో క్షయ నివారణ చర్యలు చేపట్టి క్షయ కానరాని ప్రపంచాన్ని నిర్మించాలని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ పిలుపునిచ్చారు. సోమవారం కలెక్టరేట్‌లో ప్రపంచ క్షయ నిర్మూలన దినం సందర్భంగా వాల్‌పోస్టర్‌ను ఆయన ఆవిష్కరిచారు. కలెక్టర్ మాట్లాడుతూ మైకో బ్యాక్టీరియా గాలి ద్వారా ఊపిరితిత్తులకు సోకడంతో కలిగే ప్రమాదకర అంటువ్యాధి క్షయ అన్నారు. క్షయ వ్యాధిని నయం చేయడానికి, నివారించడానికి వీలు ఉన్నప్పటికీ అవగాహన లోపంతో ప్రపంచ వ్యాప్తంగా అనేక నిండు ప్రాణాలు గాల్లో కలుస్తున్నాయన్నారు. ఇలాంటి తీవ్ర పరిణామాలకు కారణ మవుతున్న క్షయ పట్ల పూర్తి అవగాహన కల్పించటానికి ప్రతి ఏట 24 మార్చిన ప్రపంచ క్షయ దినం నిర్వహిస్తున్నట్టు చెప్పారు. జిల్లాలో ఏడు ట్రీట్మెంట్ యూనిట్లు, 23 నాట్ కేంద్రాలు పనిచేస్తున్నాయన్నారు. ఈ ఏడాది 11,677 అనుమానిత కేసులను పరీక్షించి 223 మందికి క్షయ వ్యాధి ఉన్నట్లు గుర్తించామన్నారు. మొండి వ్యాధిగ్రస్తులకు నిక్షయ్ పోషణ యోజన కింద నెలకు రూ.1,000 భృతిని కల్పిస్తున్నట్లు తెలిపారు. జాయింట్ కలెక్టర్ టి. నిషాంతి మాట్లాడుతూ క్షయ వ్యాధి ప్రమాదం, ప్రాణాంతకం అయినప్పటికీ జాగ్రత్తలు తీసుకుంటే నివారణ సాధ్యమేనని తెలిపారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శంకర్రావు, డాక్టర్ సుమలత, ఆర్‌బీఎస్ కే కోఆర్డినేటర్ జాన్ లెవీ, టీవీ కోఆర్డినేటర్ ఫిజికల్ పాల్గొన్నారు



క్షయపై వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్

మార్కెట్ విలువలపై వస్తున్న ఫిర్యాదులపై న్యాయం చేయాలి

వివిధ ప్రాజెక్టులు, నివేశన స్థలాల భూసేకరణకు సంబంధించి మార్కెట్ విలువలపై వస్తున్న ఫిర్యాదులపై దృష్టి సారించి న్యాయం చేకూర్చాలని జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి సబ్ రిజిస్టర్ రెవెన్యూ అధికారులకు సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లో రామచంద్రపురం డివిజన్‌కు సంబంధించి భూములు కోల్పోయిన వారి నుంచి మార్కెట్ విలువలకు సంబంధించి వస్తున్న ఫిర్యాదులపై సమీక్షించారు. రామచంద్రపురం ఆర్డీవో అఖిల, మార్కెట్ విలువల డీఐజీ వెంకట భీమేశ్వరరావు, మార్కెట్ విలువల ఆడిటర్ జేవీయస్ జయలక్ష్మి, మండపేట సబ్ రిజిస్ట్రార్ కేవీఎస్ కుమార్, రామచంద్రపురం సబ్ రిజిస్ట్రార్ టీవీఎస్ శ్రీనివాసరావు, తహసీల్దార్ అశోక్‌కుమార్ పాల్గొన్నారు.

గ్రీవెన్స్ ఫిర్యాదులకు ప్రాధాన్యమివ్వాలి
ఎస్పీ కార్యాలయానికి 27 అర్జీలు

అమలాపురం టౌన్: స్థానిక జిల్లా ఎస్పీ కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 27 అర్జీలు వచ్చాయి. పోలీస్ గ్రీవెన్స్‌కు వచ్చిన ఫిర్యాదులపై జిల్లాలోని పోలీసు అధికారులు తొలి ప్రాధాన్యం ఇవ్వాలని ఎస్పీ బి.కృష్ణారావు ఆదేశించారు. గ్రీవెన్స్‌కు జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి వచ్చిన అర్జీదారులతో ఎస్పీ కృష్ణారావు స్వయంగా మాట్లాడి వారి సమస్యల పరిష్కారానికి చొరవ చూపారు. గ్రీవెన్స్‌కు వచ్చే ఫిర్యాదులు పరిష్కారం అయ్యాక తీసుకున్న చర్యలపై నివేదికను నిర్ణీత గడువు లోగా ఎస్పీ కార్యాలయానికి పంపించాలని పోలీస్ అధికారులకు సూచించారు. వచ్చిన 27 అర్జీల్లో కుటుంబ తగాదాలు, ఆస్తి వివాదాలకు సంబంధించిన అర్జీదారులతో ఎస్పీ మాట్లాడి వారి సమస్యల పరిష్కారాలకు ఆయా ప్రాంతాల పోలీస్ స్టేషన్ల సీఐ, ఎస్సైలను ఆదేశించారు.



అర్జీదారులతో మాట్లాడుతున్న ఎస్పీ కృష్ణారావు

'చరిత్ర, రసాయన' జవాబు పత్రాల మూల్యాంకనం



సమావేశంలో మాట్లాడుతున్న డీఐఈవో సోమశేఖరరావు

అమలాపురం టౌన్: ఇంటర్మీడియెట్ పరీక్షల జవాబు పత్రాల మూల్యాంకనానికి సంబంధించి అమలాపురం ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలోని స్పాట్ వాల్యూయేషన్ సెంటరులో చరిత్ర, రసాయన శాస్త్రం జవాబు పత్రాల మూల్యాంకనం సోమవారం మొదలైంది. ఇప్పటికే ఈ సెంటరులో సంస్కృతం, తెలుగు, ఇంగ్లిషు, గణితం, పౌరశాస్త్రం, భౌతిక శాస్త్రం, అర్థ శాస్త్రాలకు సంబంధించిన జవాబు పత్రాలను దిద్దే ప్రక్రియ కొనసాగుతోందని డీఐఈవో వనుము సోమశేఖరరావు తెలిపారు. మరో మూడు పాఠ్యాంశాల జవాబు పత్రాలకు మూల్యాంకనం మొదలు కావాల్సి ఉందన్నారు. ప్రథమ, ద్వితీయ సంవత్సరాల మూల్యాంకనం జరుగుతోందని చెప్పారు. సోమవారం నుంచి మొదలైన రసాయన శాస్త్రంలో 21,001 జవాబు పత్రాలు, చరిత్రలో 993 జవాబు పత్రాల మూల్యాంకనం జరుగుతోందని వివరించారు. స్థానిక స్పాట్ వాల్యూయేషన్ సెంటరులో మూల్యాంకనం జాగ్రత్తలపై సంబంధిత అధికారులు, అధ్యాపకులతో సోమవారం మరోసారి డీఐఈవో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. అసిస్టెంట్ క్యాంపు ఆఫీసర్లు పి.కర్ణారావు, వి.నాగలక్ష్మి, అడబాల శ్రీనివాస్, వై.లక్ష్మణరావు, చీఫ్ కోడింగ్ ఆఫీసర్ ఇ.సువర్ణకుమార్, స్పాట్ వాల్యూయేషన్‌లో విధులు నిర్వర్తిస్తున్న జిల్లాలోని వివిధ కళాశాలల ప్రిన్సిపాల్స్, అధ్యాపకులు పాల్గొన్నారు.

మంచినీళ్లు ఇవ్వాలని మహిళల ధర్నా



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న మహిళలు

అమలాపురం రూరల్: ఎన్నోఏళ్లుగా మంచినీళ్లు లేక ఇబ్బందులు పడుతున్నా అధికారులు పట్టించుకోపోవడంతో అమలాపురం రూరల్ మండలం వన్నె చింతలపూడికి చెందిన పరపేట గ్రామస్తులు సోమవారం కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. వన్నె చింతలపూడి గ్రామంలో ఒక వాటర్ ట్యాంక్ నుంచి ఎక్కువ జనాభా ఉన్న 5 పేటలకు నీళ్లు ఇవ్వడంతో పరపేట ప్రజలకు నీళ్లు అందే పరిస్థితి లేదు. మంచినీళ్లు కావాలంటే 2 కిలోమీటర్లు దూరం వెళ్లి తెచ్చుకునే పరిస్థితి ఏర్పడింది. గత సంవత్సరం పరపేటలో వాటర్ ట్యాంక్ నిర్మాణం చేపట్టారు. ట్యాంక్ నిర్మాణం పూర్తి అయినా ప్రారంభోత్సవానికి నోచుకోని పరిస్థితి ఏర్పడడంతో మహిళలు కలెక్టర్ కార్యాలయం చేరుకుని మంచినీటి కష్టాలపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఇప్పటికైనా అధికారులు వాటర్ ట్యాంక్ ప్రారంభం చేయాలని, వేసవికాలం ప్రారంభం అవ్వడంతో మంచినీటి కష్టాలు రోజు రోజుకీ పెరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. పరమట దుర్గా భవాని, సీత మహాలక్ష్మి, విజయలక్ష్మి, కృష్ణ వేణి, వెర్రమ్మ, చింతలమ్మా, సుందరి వేణి, చీకురుమెల్లి శ్రీదేవి, సకిలే అరుణ పాల్గొన్నారు.

ఎన్టీఆర్ వైద్య మిత్రల ఆందోళన



కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న ఎన్టీఆర్ వైద్య మిత్రలు

అమలాపురం రూరల్: ఎన్టీఆర్ వైద్య సేవలో వైద్య మిత్రల సమస్యలను పరిష్కరించాలని కలెక్టరేట్ వద్ద సోమవారం ధర్నా నిర్వహించారు. ఫీల్డ్ ఉద్యోగులుగా పనిచేస్తున్న తమను కాంట్రాక్టు ఉద్యోగులుగా గుర్తించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని విధులకు వెళ్లకుండా ఆందోళన చేశారు. 17 సంవత్సరాల సర్వీసుని పరిగణనలోకి తీసుకొని ఫీల్డ్ సిబ్బందిని ప్రభుత్వ కాంట్రాక్ట్ ఉద్యోగులుగా గుర్తిస్తూ వైద్య మిత్రలకు డీపీఓ కేడర్, ఆఫీస్ అసోసియేట్, టీమ్ లీడర్ల సమాన అర్హత కలిగిన కేడర్, జిల్లా మేనేజర్‌లకు డీవైఈవో కేడర్ అమలు చేసి కనీస వేతనం ఇవ్వాలని కోరారు. చనిపోయినవారి కుటుంబాలకు రూ.15 లక్షల ఎక్స్‌గ్రేషియో, రిటైర్మెంట్ బెనిఫిట్ రూ.10 లక్షలు, ప్రభుత్వ ఉద్యోగాలలో వెయిటేజ్ కల్పించాలని జేసీ నిషాంతిని కలిసి వినతి పత్రం అందించారు. సంఘం నాయకులు చీకట్ల వెంకయ్య నాయుడు, మచ్చా నరసింహరాజు, గోలకోటి సతీష్, కావూరి చంద్రశేఖర్ పాల్గొన్నారు.

కోకోకు ఇదే సీజన్

- కోతలో మెళకువలు పాటించాలి
- గింజల గ్రేడింగ్‌తో అధిక ధరలు
- కోనసీమ జిల్లా ఉద్యాన శాఖ అధికారి రమణ



ఐ.పోలవరం: కోకో ఏడాది పొడవునా కాపు ఉన్నప్పటికీ మార్చి నుంచి మే నెలాఖరు అంటే మూడు నెలలపాటు అధిక దిగుబడులు వస్తాయి. ఈ సమయంలో వచ్చిన గింజలు అధిక నాణ్యత కలిగి ఉంటాయి. కోకో గింజల ధరలు పొందాలంటే విత్తనాల నాణ్యత పెంచాల్సి ఉంది. ఇందుకు ఉత్తమ యాజమాన్య పద్ధతులు పాటించాలని చెబుతున్నారు జిల్లా ఉద్యాన శాఖాధికారి బి.వి.రమణ (89998 35469). కోకో గింజలకు జాతీయంగా, అంతర్జాతీయంగా డిమాండ్ ఉన్నందున నాణ్యమైన గింజల ఉత్పత్తి చేసేందుకు రైతులు చేపట్టాల్సిన చర్యలను ఆయన వివరించారు. ఆయన మాటల్లోనే..

మన ప్రాంతంలో పండే కోకో గింజలకు అంతర్జాతీయంగా మంచి డిమాండ్ ఉంది. ప్రపంచంలో గనా దేశం కోకో గింజల నాణ్యతలో ప్రథమస్థానంలో ఉండేది. దానిని ఇప్పుడు మనం అధిగమించాం. వాతావరణ పరిస్థితులు, మార్కెట్ ఒడిదొడుకుల కారణంగా 2024లో కిలో నాణ్యమైన కోకో గింజలకు రికార్డు స్థాయిలో రూ.950 నుంచి రూ.1,000 వరకు ధర వచ్చింది. ఇప్పుడు ధర కొంత తగ్గినా మార్కెట్‌లో కేజీ ధర రూ.550 నుంచి రూ.650 వరకు ఉంటోంది. దీని వల్ల ఈ పంట రైతులకు పూర్తిగా లాభదాయకం. పైగా ఇది కొబ్బరి, ఆయిల్ పామ్ తోటలలో అంతర పంటగా సాగు చేస్తున్నందున రైతుకు అదనపు ఆదాయం వచ్చే పంట. కోకో చెట్టుకు అధికంగా ఆకు రాలుస్తుంది. ఈ కారణంగా రైతుకు రూపాయి పెట్టుబడి లేకుండా మంచి సేంద్రియ ఎరువు పొందే అవకాశముంది. ఇలా బహుళ ప్రయోజనాలు ఉన్న సాగుగా పేరొందిన కోకోలో మంచి దిగుబడి సాధిస్తే రైతులు మరింత లాభాలు పొందే అవకాశముంది. కోకోలో ప్రతి ఏటా రెండు సందర్భాలలో అధిక దిగుబడులు వస్తాయి. ఒకటి సెప్టెంబర్–జనవరి కాగా, రెండవది ఏప్రిల్–జూన్ మాసాలలో వస్తుంది. ఏప్రిల్ – జూన్ మాసాలలో వచ్చే దిగుబడి అధికంగా ఉంటుంది.



నాణ్యమైన కోకో గింజలు

పాడి-పంట

గింజల గ్రేడింగ్.. నిల్వ చేయడం

ఎండబెట్టిన గింజల నుంచి తప్పలు, ముక్కలు, ముడుచుకు పోయిన గింజలు, రాళ్లు తీసివేసి పాలిథీన్ లైనింగ్ (150–200 గేజు) కలిగిన గోనె సంచులలో నిల్వ చేసుకోవాలి. ఈ సంచులను ఎత్తైన అరుగుల మీద ఉంచాలి.

కృత్రిమంగా ఎండబెట్టడం

వర్షాకాలంలో గింజలను ఎండబెట్టటానికి విద్యుత్తు ఓవెన్స్ చాలా ఉపయోగపడతాయి. 72 నుంచి 96 గంటలలో గింజలు ఎండటం పూర్తవుతుంది. నెమ్మదిగా తక్కువ ఉష్ణోగ్రత వద్ద గింజలు ఎండటం వలన నాణ్యత బాగుంటుంది. ఓవెన్లో గింజలను 50-55 డిగ్రీల సెంటిగ్రేడ్ వద్ద 8–10 గంటలు మాత్రమే మొదటి 2 రోజులు ఎండబెట్టాలి. తర్వాత 60 డిగ్రీల సెంటిగ్రేడ్ వద్ద రోజంతా ఎండబెట్టవచ్చు. ఈ విధంగా 72 నుంచి 96 గంటలలో ఎండడం పూర్తవుతుంది.

బుట్ట పద్ధతి



ఎండబెట్టిన పద్ధతిలో కోకో గింజలు

తడిగింజ పరిమాణం తక్కువగా ఉన్నప్పుడు వెదురు లేదా కేను బుట్టలను పులియబెట్టడానికి వాడుకోవచ్చు. వెదురుబుట్ట లోపలి అంచులను అరటి ఆకులతో కప్పాలి. బుట్ట అడుగుభాగం మాత్రం ఆకులతో కప్పకూడదు. బుట్టను గింజలతో నింపి అరటి ఆకులతో కప్పాలి. దానిపైన కొద్ది బరువును ఉంచాలి. బుట్టను నేలకు తగలకుండా కొంచెం ఎత్తైన ప్రదేశంలో ఉంచడం వలన గింజలకున్న గుజ్జు సులభంగా బుట్ట అడుగు భాగం నుండి కారిపోతుంది. తరువాత బుట్టను గోనె సంచితో కప్పాలి. గింజలను 3వ, 5వ రోజున కలిపి, గోనె సంచితో కప్పాలి. ఆరు రోజులలో పులియడం పూర్తవుతుంది.

ఎండబెట్టడం: పులియబెట్టిన గింజలను పల్చగా సిమెంటు గచ్చు మీద గాని, వెదురు చాప మీద గాని 5 – 6 రోజుల వరకు ఎండబెట్టాలి. మధ్యలో గింజలను కలియబెడుతూ ఉండాలి. ఎండిన గింజలలో తేమ 67 శాతం మాత్రమే ఉండేలా చూసుకోవాలి.

కాయ కోత - మెళకువలు

పసుపుచార వచ్చిన లేదా పక్వానికి వచ్చిన కాయలను పదునైన కత్తితో కోయాలి. అయితే కాయకు ఉండే చిన్న పాటి కాండం (తొడిమ) చెట్టుకు ఉండేటట్టు చూడాలి. కాండంతో కాయ కోస్తే దాని చుట్టూ వచ్చే పూత దెబ్బతింటుంది. కోసిన కాయలను 2 నుంచి 3 రోజులు నిల్వ చేసిన తర్వాత పగుల గొట్టి గింజలు తీయాలి. కాయలను కర్రతో మధ్య భాగంలో బద్దలు కొట్టి, గింజలను గుజ్జుతో సహా వేరు చేయాలి. కాయ మధ్య భాగంలో ఉన్న కాడను, తొక్కను పులియ బెట్టడానికి ముందు తొలగించాలి.




కాయకు ఉండే చిన్న పాటి కాండం (తొడిమ) చెట్టుకు ఉండేటట్టు కోకో కాయ కోత

కోకో గింజల ప్రాసెసింగ్

పులియ బెట్టడం: కోకో గింజలు చుట్టూ వున్న గుజ్జును తొలగించడానికి, మంచి సువాసన, రుచిని కలిగించడానికి పులియ బెట్టడం మంచి పద్ధతి. గింజలలో అమ్లతను 5.5కు తీసుకు రావడం, వగరు, చేదును తగ్గించడానికి, గింజలో మొలకను చంపడానికి, చుట్టూ వున్న పల్చని తొక్కను తొలగించడానికి పులియ బెట్టడం చాలా అవసరం. పెట్టె పద్ధతి, ట్రే పద్ధతి, బుట్ట పద్ధతి ద్వారా కోకో గింజలను పులియబెట్టడం మంచిది.

పెట్టె పద్ధతి

60 సెం.మీ. ఇన్‌టు 60 సెం.మీ. ఇన్‌టు 45 సెం.మీ. సైజు కర్రలతో చేసిన పెట్టెలు అవసరం. కారిన గుజ్జు పోవడానికి, గాలి తగలడానికి పెట్టె కింద రీపర్ బద్దలు నాటాల్సి ఉంది. తడి గింజలను పెట్టెలో దగ్గరగా అమర్చి అరటి ఆకులతో గాని (లేదా) గోనె సంచులతో గాని కప్పాలి. 24 గంటల తరువాత వేరే పెట్టెలోకి మార్చేటప్పుడు గింజలను మళ్లీ కలపాలి. సమానంగా పులవడానికి సరియైన ఉష్ణోగ్రత తేమ, గాలి ఉండేలా చూడడం ఎంతో అవసరం. పెట్టెలో 48 గంటల తరువాత ఉష్ణోగ్రత 42 నుంచి 48 డిగ్రీల సెంటిగ్రేడ్ వరకు పెరుగుతుంది. పులియబెట్టిన 72 గంటల తరువాత గింజలను వేరే పెట్టెలోకి మార్చాలి. ఒక రోజు తరువాత చివరిగా గింజలను మార్చాలి. ఈ విధంగా పులియడానికి 6 రోజులు అవసరమవుతుంది.



పెట్టెలో పులియబెట్టిన కోకో గింజలు

అతి వేగానికి ఇద్దరు యువకుల బలి

- మోటార్ సైకిల్‌ను ఢీకొట్టిన కారు
- ఒకరు అక్కడికక్కడే మృతి, మరొకరు ఆసుపత్రిలో..
- కన్నీరు మున్నీరుగా విలపించిన కుటుంబ సభ్యులు



సురేష్ (ఫైల్)



హనుమంతు (ఫైల్)



ప్రమాద స్థలిలో మృతి చెందిన సురేష్



ఆసుపత్రిలో మృతి చెందిన హనుమంతు



ప్రమాదానికి కారణమైన కారు

పెరవలి: అతి వేగం ఇద్దరు యువకులను బలి తీసుకుంది. జాతీయ రహదారిపై పెరవలి మండలం అన్నవరప్పాడు సెంటర్‌లో రోడ్డు దాటుతుండగా మోటార్ సైకిల్‌ను కారు ఢీకొట్టడంతో ఇద్దరు యువకులు మృతిచెందారు. పెరవలి ఎస్ఐ ఎం.వెంకటేశ్వరరావు తెల్పిన వివరాలిలా ఉన్నాయి. పెరవలి మండలం పిట్టల వేమవరం గ్రామానికి చెందిన మాకా సురేష్ (26), నేతల హనుమంతు (26) అన్నవరప్పాడు సెంటర్‌లో మోటార్ సైకిల్‌పై రోడ్డు దాటుతుండగా అదే సమయంలో రావులపాలెం నుంచి తణుకు వైపు వెళుతున్న కారు వేగంగా వచ్చి ఢీకొట్టింది. కారు వచ్చిన వేగానికి మోటార్ సైకిల్ గాలిలోకి ఎగిరి సుమారు 20 మీటర్ల దూరంలో పడి ఆగిఉన్న మరో కారును ఢీకొట్టి పడిపోయింది. దీంతో మాకా సురేష్ తలకు బలమైన గాయం అయ్యి అక్కడికక్కడే మృతి చెందాడు. కారు, మోటార్ సైకిల్‌ను ఢీకొట్టిన వెంటనే పెద్ద శబ్దం రావటంతో సెంటర్‌లో ఉన్న జనం పరుగున వచ్చి పడిపోయిన ఇద్దరిని లేపటానికి ప్రయత్నించారు. వీరిలో మాకా సురేష్‌లో ఎటువంటి కదలిక లేదు. నేతల హనుమంతు కదులుతుండటంతో హైవే అంబులెన్స్‌కు ఫోన్ చేయటంతో వెంటనే వచ్చి తణుకులో ఆసుపత్రికి తరలించారు. ప్రమాద స్థలానికి వచ్చిన సురేష్ తండ్రి వెంకటేశులు, తల్లి కన్నీరు మున్నీరుగా విలపించారు. తీవ్ర గాయాలైన నేతల హనుమంతు తండ్రి ప్రసాద్, కుటుంబ సభ్యులు ఆసుపత్రికి వెళ్లే సమయానికి కుమారుడు మృతి చెందాడని తెలిసి హతాశులయ్యారు. మాకా వెంకటేశులు ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రెండు కుటుంబాలకు వీరే ఆధారం

రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఇద్దరి కుటుంబీకులు పేదలు. రెండు కుటుంబాలకు వీరే ఆధారం. రెక్కాడితే కానీ డొక్కాడని బడుగు జీవులు, కుమారులు మృతితో ఇరు కుటుంబాలు తీవ్ర మనోవేదన అనుభవిస్తున్నాయి. మాకా వెంకటేశులు, భార్య ధనలక్ష్మిలకు ఇద్దరు అమ్మాయిలు, ఒక కుమారుడు సురేష్. ఇద్దరు ఆడపిల్లలకు వివాహం చేశారు. తల్లి తండ్రులకు సురేష్ ఒక్కడే ఆధారం. అతను ఇలా రోడ్డు ప్రమదంలో మృతి చెందడంతో వారు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు.

నేతల హనుమంతు తండ్రి ప్రసాద్, కృష్ణవేణిలకు ముగ్గురు పిల్లలు పుట్టగా హనుమంతు అన్న మూడేళ్ల క్రితం మృతి చెందాడు. ప్రస్తుతం మృతుడి చెల్లికి వివాహం జరిగింది. ఇప్పుడు రోడ్డు ప్రమాదంలో హనుమంతు మృతిచెందటంతో తల్లితండ్రులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. హనుమంతు తెచ్చిన కూలి డబ్బులే ఈ కుటుంబానికి జీవనాధారం కావటంతో తల్లితండ్రులు బిడ్డ పోయాడని ఒకవైపు రోదిస్తూ మమ్మల్ని ఎవరు ఆదుకుంటారు అంటూ విలపిస్తుంటే చూపరులు కూడ కన్నీటి పర్యంతం అయ్యారు. తల్లితండ్రులు ఇద్దరు భగవంతుడా మీకు ఏమి అన్యాయం చేశాము, ఈ చివరి క్షణాల్లో మమ్మల్ని ఆదుకునేదెవరు, ఒక బిడ్డను ముందు తీసుకెళ్లావు. అది మర్చిపోకముందే రెండవ బిడ్డను తీసుకెళ్లిపోయావా అంటూ హృదయ విదారకంగా విలపించారు.



ప్రియురాలిని, ఆమె తల్లిని హత్య చేసిన

ప్రియుడి అరెస్టు



శివకుమార్ అరెస్టుకు సంబంధించిన వివరాలు తెలుపుతున్న ఈస్ట్‌జోన్ డీఎస్పీ విద్య

రాజమహేంద్రవరం రూరల్: ప్రియురాలిని, ఆమె తల్లిని హత్యచేసిన ప్రియుడు పల్లి శివకుమార్‌ను బొమ్మూరు పోలీసులు సోమవారం సాయంత్రం అరెస్టు చేశారు. ఆ వివరాలను సోమవారం రాత్రి రాజమహేంద్రవరం ఈస్ట్ జోన్ డీఎస్పీ బి.విద్య బొమ్మూరు పోలీస్‌స్టేషన్‌లో వెల్లడించారు. మృతిచెందిన మహమ్మద్ సల్మా(37), ఆమె కుమార్తె మహమ్మద్ సుమయ్య(16) హుకుంపేట డిబ్లాకులో నివసిస్తున్నారు. సుమయ్య పెళ్లి ఈవెంట్లు చేస్తూ కుటుంబాన్ని పోషించేది. ఈవెంట్లు చేస్తున్న సమయంలో ఈ కేసులో నిందితుడైన శ్రీకాకుళం జిల్లా నందిగాం గ్రామానికి చెందిన ప్రస్తుతం హైదరాబాద్‌లో ఉంటున్న పల్లి శివకుమార్‌తో పరిచయం ఏర్పడింది. వారి పరిచయం ప్రేమగా మారింది. పల్లి శివకుమార్ హైదరాబాద్‌లో నివసిస్తూ అక్కడ పనిచేసేవాడు. మృతిచెందిన సుమయ్యకు ఫోన్ చేసే సమయంలో ఆమె ఫోన్ వెయిటింగ్ వస్తే ఆమెను అనుమానిస్తూ, సుమయ్యతో గొడవ పడుతూ ఉండేవారు. ఈ క్రమంలో ఆరురోజుల క్రితం శివకుమార్ మృతుల ఇంటికి వచ్చి వాళ్లతో గొడవపడి చంపుతానని బెదిరించాడు. సుమయ్యకు ఇంకెవరితోనో మాట్లాడేందుకు, ఆమె తల్లి సల్మా సహకరిస్తోంది అనే ఉద్దేశంతో శివకుమార్ ఆదివారం ఉదయం 8.00గంటల సమయంలో సుమయ్య, ఆమె తల్లి సల్మాలను వారి ఇంటిలోనే కత్తితో పొడిచి హత్యచేసి ఇంటికి తాళంవేసి పరారయ్యాడు. మృతురాలు మహమ్మద్ సల్మా కుమారుడు మహమ్మద్ ఆలీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు బొమ్మూరు పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ పి.కాశీవిశ్వనాథ్ కేసు నమోదు చేశారు. ఎస్పీ డి.నరసింహకిశోర్ ఆదేశాల మేరకు ఈస్ట్‌జోన్ డీఎస్పీ బి.విద్య ఆధ్వర్యంలో నిందితుడి కోసం గాలింపు చర్యలు చేపట్టారు. ఆదివారం రాత్రి శివకుమార్‌ను కొవ్వూరు రూరల్ పోలీసులు గుర్తించి అదుపులోనికి తీసుకుని, బొమ్మూరు పీఎస్ ఇన్‌స్పెక్టర్‌కు సమాచారం ఇచ్చారు. బొమ్మూరు ఇన్‌స్పెక్టర్ కాశీవిశ్వనాథ్, సిబ్బందితో వెళ్లి శివకుమార్‌ను అరెస్టు చేశారు. రిమాండ్ నిమిత్తం న్యాయమూర్తి ఎదుట హాజరుపరుస్తామని ఈస్ట్‌జోన్ డీఎస్పీ బి.విద్య తెలిపారు. బొమ్మూరు పీఎస్ ఇన్‌స్పెక్టర్ కాశీవిశ్వనాథ్, ఎస్సై సీహెచ్‌వీ రమేష్, సిబ్బంది పాల్గొన్నారు.

మహిళ దుర్మరణం

అంబాజీపేట: మతిస్థిమితం లేని ఓ మహిళను సోమవారం తెల్లవారుజాము పుల్లేటికుర్రు శివారు చినలంక వద్ద గుర్తుతెలియని వాహనం ఢీ కొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందింది. గుర్తుతెలియని మహిళ మతిస్థిమితం లేకపోవడంతో అంబాజీపేట మండల పరిసర ప్రాంతాల్లో తిరుగుతోంది. తెల్లవారుజామున ఆమెను గుర్తుతెలియని వాహనం ఢీ కొట్టడంతో అక్కడికక్కడే చనిపోయింది. వీఆర్వో ఇచ్చిన ఫిర్యాదు మేరకు ట్రైనీ డీఎస్పీ పి.ప్రదీప్తి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కె.చిరంజీవి తెలిపారు.

గుండెపోటుతో ఉపాధి మహిళా కూలీ మృతి

అంబాజీపేట: ఉపాధి పనులు చేస్తుండగా మహిళా ఉపాధి కూలీకి గుండెపోటు రావడంతో అక్కడికక్కడే కుప్పకూలిపోయింది. స్థానికులు తెలిపిన వివరాలు ఎలా ఉన్నాయి. ఇసుకపూడికి చెందిన ఉపాధి హామీ కూలి జక్కంశెట్టి విశాలాక్షి (73) సోమవారం ఉపాధి పనులు చేస్తుండగా గుండుపోటుకు గురై తుది శ్వాస విడిచింది. ఆమె మృతదేహానికి ఏపీఓ ఏ.వి.కృష్ణ, ఫీల్డ్ అసిస్టెంట్ కె.గంగాధర్, టెక్నికల్ అసిస్టెంట్ మనోహర్, ఉపాధి కూలీలు శ్రద్ధాంజలి ఘటించారు.

గోదావరిలో దూకి

వ్యక్తి ఆత్మహత్య



కలివరపు చాణక్య (ఫైల్)



గోదావరి నుంచి వెలికితీసిన చాణక్య మృతదేహం

కొవ్వూరు: నందమూరు గ్రామానికి చెందిన కలివరపు చాణక్య(36) సోమవారం గోదావరి నదిలో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డారు. బై పోలార్ అనే వ్యాధితో బాధపడుతున్న చాణక్య ఉదయం ఇంటి నుంచి బయల్దేరి రోడ్డు కం రైలు వంతెన పై నుంచి గోదావరి నదిలో దూకారు. పోలీసులు రెస్క్యూ టీము సహకారంతో నదిలో గాలించారు. ఎరినమ్మ ర్యాంపు సమీపంలో మృతదేహాన్ని గుర్తించి వెలికి తీశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం కొవ్వూరు ప్రభుత్వ సామాజిక ఆసుపత్రికి తరలించినట్లు పట్టణ సీఐ పి.విశ్వం తెలిపారు. మృతుడికి భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు.

అంబాజీపేట కొబ్బరి మార్కెట్

కొబ్బరి రకం	ధర (రూ.ల్లో)
కొత్తకొబ్బరి (క్వింటాల్)	14,000 – 14,500
కొత్తకొబ్బరి (రెండవ రకం)	9,500 – 10,000
కురిడీ కొబ్బరి (పాతవి)	
గండేరా (వెయ్యి)	15,500
గటగట (వెయ్యి)	14,500
కురిడీ కొబ్బరి (కొత్తవి)	
గండేరా (వెయ్యి)	14,500
గటగట (వెయ్యి)	13,500
నీటికాయ,పాత (ముక్కుడు)కాయ (వెయ్యి)	13,000 – 13,500
కొత్త (పచ్చి)కాయ (వెయ్యి)	13,000 – 13,500
కొబ్బరి నూనె (15 కిలోలు)	3,750
ఒక కిలో	260

గంజాయి సరఫరా చేసే 14 మందిపై చర్యలు

జగ్గంపేట: పోలీసు సర్కిల్ పరిధిలో గంజాయి అమ్మకం, సరఫరా దారులుగా అనుమానంతో పట్టుకున్న 14మందిపైపై సస్పెక్ట్ షీట్స్‌ను ఓపెన్ చేసినట్లు జగ్గంపేట సీఐ వైఆర్‌కె శ్రీనివాసరావు తెలిపారు. జగ్గంపేట పరిసరాలలో బాలికల పట్ల అనుచితంగా ప్రవర్తిస్తున్న నలుగురిపై రౌడీ షీట్స్ ఓపెన్ చేసినట్లు తెలిపారు.

పశివేదలలో చోరీ

ఎనిమిది కాసుల బంగారం, ఐదు కిలోల వెండి అపహరణ

కొవ్వూరు: పశివేదల గ్రామంలో పావులూరి రమా సుందరి అనే మహిళ ఇంట్లో ఆదివారం రాత్రి దొంగలు చొరబడి చోరీకి పాల్పడ్డారు. ఎనిమిది కాసుల బంగారు ఆభరణాలు, ఐదు కిలోల వెండి వస్తువులు అపహరించుకుని పోయారు. ఈమె కుమారుడు మహేష్ శివాలయంలో పూజారిగా పనిచేస్తున్నారు. రాత్రి ఇంటికి తాళం వేసి అదే గ్రామంలో శివాలయం వద్ద ఉంటున్న కుమారుడు వద్దకు ఆమె వెళ్లారు. మెస్ డోర్ తొలగించి ఇంట్లోకి ప్రవేశించిన దొంగలు బీరువాలో ఉన్న ఆభరణాలను అపహరించుకుని పోయారు. సోమవారం ఉదయం ఇంటికి వచ్చేసరికి చోరీకి జరిగినట్లు బాధితురాలు గుర్తించారు. ఆమె ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ ఆర్.భగవాన్‌దాస్ తెలిపారు.